క్లుప్తంగా

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాట



మజ్జివలసలో ఉత్సవరాట వేస్తున్న మహిళలు

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసలో నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు స్థానిక మహిళలు మంగళవారం ఉత్సవ రాట వేశారు. ఈ నెల 15 నుంచి 23 వరకు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నప్రసాదాల వితరణ నిర్వహిస్తామని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇప్పటి వరకు 21 సంవత్సరాలుగా ఉత్సవాలు నిరాటంకంగా నిర్వహిస్తున్నట్లు పంచాయతీ వాసులు తెలిపారు.

210 మంది విద్యార్థుల రక్తదానం



అనిట్స్‌లో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మంగళవారం 210 మంది ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రక్తదానం చేశారు. లయన్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ ఆర్గనైజేషన్, అనిట్స్ ఎన్‌ఎస్‌ఎస్ సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ పీవో గంటా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లపై జీబ్రా లైన్లు



జీబ్రా లైన్లు వేయిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: భీమిలి రోడ్డులో రెండో వార్డు జీరుపేట వద్ద ప్రధాన రహదారిపై స్పీడ్ బ్రేకర్లకు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం జీబ్రా లైన్లు వేయించారు. రాత్రి వేళ వేగంగా వచ్చే వాహనదారులు స్పీడ్ బ్రేకర్లను గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నట్టు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి తెలిపారు. ప్రమాదాల నివారణకు తమ వంతు బాధ్యతగా జీబ్రా లైన్లు వేయిస్తున్నట్టు తెలిపారు. ఆయనకు సీనియర్ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి తదితరులు సహకరించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై సర్వే



సంతపేటలో సర్వేలో ఆరోగ్య సిబ్బందితో వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డులో ఈ నెల 30న జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి సంబంధించి ఆరోగ్య సిబ్బంది మంగళవారం ఇంటింటా సర్వే చేపట్టారు. ప్రజల ఆరోగ్య స్థితిగతులను వాకబు చేసి యాప్‌లో నమోదు చేశారు. కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. మాజీ కౌన్సిలర్ చేట్ల ఎల్లయ్యరెడ్డి, వైఎస్సార్ సీపీ వార్డు ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, శిల్లా వంశీ, జగన్నాథ ఎల్లాజీ, చేట్ల అప్పలసూరమ్మ, నమ్మి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

‘సురక్ష’తో పేదల ఆరోగ్యానికి భరోసా



పౌష్టికాహారం స్టాల్ పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు



పెదనాగమయ్యపాలెంలో గర్భిణులతో ఎంపీపీ వాసురాజు, ఎంపీడీవో వెంకటరమణ



పోషకాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న డీఎల్‌డీవో పూర్ణిమ

ఆనందపురం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు రక్షగా మారిందని జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు అన్నారు. మండలంలోని వేములవలసలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పల్లెల్లో చిన్న రోగానికైనా వైద్యుల వద్దకు వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు చేసుకోవాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైద్యులనే ఇంటింటికీ పంపించి సేవలు అందిస్తుండడంతో పేదలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో 12 రకాల పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తున్నారని, ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వైద్య శిబిరంలో 655 మందికి పరీక్షలు నిర్వహించారు. ఐదుగురిని మెరుగైన చికిత్స కోసం రిఫర్ చేశారు. మరో 11 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పద్మావతి, ఎంపీడీవో అడపా లవరాజు, సర్పంచ్ లెంక కొండమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కోరాడ సూర్యకుమారి, పార్టీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, కోరాడ అప్పలస్వామి నాయుడు, కోరాడ రాంబాబు, బొట్టా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘సురక్ష’ శిబిరానికి విశేష స్పందన

తగరపువలస: భీమిలి మండలం పెదనాగమయ్యపాలెం పంచాయతీలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మత్స్యకారులతోపాటు చిననాగమయ్యపాలెం, పెదనాగమయ్యపాలెం, జీరుపాలెం, పాతపాలెం గ్రామాల ప్రజలు వినియోగించుకున్నారు. ఎంపీడీవో వెంకటరమణ, వైద్యులు వై.దుర్గా కల్యాణి, ఏబీ మల్లికార్జునరావు, ఎం.ఫణికుమార్, హిమబిందు, శోభారాణి, జి.గోవింద్, మహమ్మద్ కౌసర్ తదితర వైద్యులు సేవలు అందించారు. శిబిరాన్ని డీఎల్‌డీవో పూర్ణిమ సందర్శించి గ్రామ సచివాలయ వలంటీర్లకు పలు సూచనలు చేశారు. పంచాయతీలో మొత్తం 524 మందికి పరీక్షలు నిర్వహించారు. 50 మందికి కంటి వైద్య పరీక్షలు చేయగా అయిదుగురికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ముందుగా శిబిరాన్ని ఎంపీపీ దంతులూరి వాసురాజు, సర్పంచ్ బొడ్డు సత్తెమ్మ, బొడ్డు దుర్గారావు, ఎంపీటీసీ సభ్యురాలు తోట అరుణ, తోట ఎల్లారావు తదితరులు ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను ప్రారంభించి గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను ఎంపీటీసీ సభ్యుడు చెల్లూరి నగేష్, పొట్నూరు చంద్రశేఖర్, సచివాలయ కన్వీనర్లు గరికిన నూకరాజు, బొడ్డు అప్పన్న, జీరు పోలిరెడ్డి, పంచాయతీ విస్తరణ అధికారి అప్పలరాజు, ఆరోగ్య విస్తరణ అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం: పద్మనాభంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. వైద్యులు స్వప్న, మణికుమారి 606 మందికి పరీక్షలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ తాలాడ పాప, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం రోగులకు మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, తాలాడ పద్మనాభం, పంచాయతీ కార్యదర్శి అరసాడ రఘుపతి రావు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న సర్పంచ్ పాప

నేడు ‘జగనన్నకు చెబుదాం’

దొండపర్తి : భీమిలి మండల స్థాయి ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి భీమిలి ఎంపీడీఓ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని జిల్లా స్థాయిలో నిర్వహించడం జరుగుతోందని, ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మండల స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా హెచ్‌వోడీలు, జీవీఎంసీ అధికారులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తప్పకుండా హాజరు కావాలని ఆదేశించారు. భీమిలి మండల ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

27న ముసాయిదా ఓటర్ల జాబితా

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గానికి సంబంధించిన పూర్తి ఓటర్ల వివరాలతో కూడిన ముసాయిదా జాబితాను ఈ నెల 27న విడుదల చేస్తామని ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌వోలు, బీఎల్‌ఏలతో పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితా సిద్ధం చేశామన్నారు. పూర్తి వివరాలతో జాబితా రూపొందిస్తున్నామని, ముసాయిదా కాపీలను ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులకు పంపుతామని తెలిపారు. దీనికి సంబంధించి ఈ నెల 30న సమీక్ష ఉంటుందని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. అదేవిధంగా ఈ నెల 27 నుంచి డిసెంబర్ 9 వరకు కొత్త ఓటర్ల నమోదు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 2, 3న ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆయా పార్టీల నాయకులు గాడు శ్రీను, గంటా నూకరాజు, కదిరి జగన్నాథం, ఎన్నికల డీటీ భాస్కరరావు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంక్ అకౌంట్లు తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ కనక మహాలక్ష్మి

మధురవాడ: జగనన్న గృహ నిర్మాణ పథకం కింద స్థలాలు పొంది, ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు ఖచ్చితంగా జియో ట్యాగింగ్ చేయించుకుని, బ్యాంకు అకౌంట్ తీసుకోవాలని జెడ్పీ కనక మహాలక్ష్మి సూచించారు. ఆ పనులు సచివాలయ సిబ్బంది, వలంటీర్లే చేయిస్తారని చెప్పారు. మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో ఎమినిటీస్ సెక్రటరీలు, హౌసింగ్, ఇతర అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. 6,670 మంది లబ్ధిదారుల్లో ఇంకా 1,852 మంది ఐసీఐసీఐ బ్యాంకు అకౌంట్‌లు తీసుకోవాల్సి ఉందని, మరో 1,485 మంది జియో ట్యాగింగ్ చేసుకోలేదని చెప్పారు. ఈ పనులు పూర్తి కాకపోతే ఇళ్ల నిర్మాణ పనులు ఆలస్యమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. సిబ్బంది తమకు నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయడంలో అలసత్వం ప్రదర్శించొద్దని చెప్పారు. ఇబ్బందులు ఎదురైతే తనను, గృహ నిర్మాణ శాఖ ఏఈలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈలు సూర్య ప్రకాశరావు, శేషు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ఆరోగ్యం

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపల్ శ్రీపాద శరత్ చంద్ర కీర్తి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చిన్నచిన్న విషయాలకు తీవ్రమైన ఒత్తిడి పెరిగి మానసిక సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు ధ్యానం అత్యుత్తమ మార్గమని సూచించారు. కార్యక్రమంలో మహిళా కౌన్సిలర్ ఎస్.గౌతమి తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎండాడ గ్రామ కమిటీ సభ్యులు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పది సంవత్సరాలపాటు సేవలందించిన ఉపాధ్యాయులను గ్రామ కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. పలు పాఠశాలలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు వీరయ్యదేముడు, కోన శ్రీనివాసరావు, పీవీ రమాదేవి, కె.సూర్యనారాయణ, భవానీ, వి.మణికుమార్, పి.రాధారాణి, ఎస్.తిరుమలరావు, నారాయణరావును ఎండాడ గ్రామ కమిటీ సభ్యులు సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి వీరు చేసిన సేవలను కొనియాడారు. మాదు రాజు, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి, బుజ్జి, చెట్టిపిల్లి గోపి, శేఖర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్రీకృష్ణాలో ఇంటర్వ్యూలు ప్రారంభం

తగరపువలస: చిట్టివలస శ్రీకృష్ణా డిగ్రీ కళాశాలలో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. 2015 నుంచి 2023 వరకు ఉత్తీర్ణులైన బీఏ, బీకాం, బీఎస్సీ అభ్యర్థులు 400 మంది హాజరయ్యారు. వీరికి ఏరియస్, టెక్ మహీంద్రా, కన్సెంట్రిక్స్, జస్‌పాక్ట్, ఎక్సెంచూర్, వరుణ్ మోటార్స్ సంస్థలకు చెందిన హెచ్‌ఆర్‌లు పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని శ్రీకృష్ణా విద్యాసంస్థల చైర్మన్ బి.నరగసింగరావు, ప్రిన్సిపాల్ జరజాపు సతీష్‌కుమార్ తెలిపారు.

స్మార్ట్ టీవీలతో బోధనపై అవగాహన అవసరం



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న గౌరీశంకర్

భీమునిపట్నం: పాఠశాల స్థాయిలో విద్యను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్మార్ట్ టీవీలతో బోధనపై జిల్లా విద్యాశిక్షణ సంస్థ (డైట్)లో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా డిప్యూటీ విద్యాశాఖ అధికారి ఎ.గౌరీశంకర్ మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైజ్యూస్ యాప్ ద్వారా పాఠ్యాంశాలను సరైన పద్ధతుల్లో బోధిస్తే విద్యార్థులకు మరింత చక్కగా అర్థమవుతాయన్నారు. కొత్త సాంకేతిక విధానాలను విద్యార్థులకు పరిచయం చేసి అవగాహన కల్పించడం వల్ల మరింత మెరుగ్గా చదువుకోవడానికి వీలు కలుగుతుందన్నారు. దీనిపై ప్రధానోపాధ్యాయులు పట్టుసాధించి ఇతర ఉపాధ్యాయులకు వివరించాలని సూచించారు. డైట్ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్, ఎంఈవో శివరాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు బాధ్యతతో వ్యవహరించాలి

పిల్లల చదువు విషయంలో తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని డిప్యూటీ డీఈవో గౌరీశంకర్ సూచించారు. స్థానిక పండిట్ నెహ్రూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎం.తిరుమల శ్రీదేవి అధ్యక్షతన మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఎలా చదువుతున్నారో ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన వారికి బహుమతులు అందించారు.

ఆడపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

తగరపువలస: ఆడపిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారితో తల్లిదండ్రులు అన్ని విషయాలపై మాట్లాడాలని బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు సూచించారు. మంగళవారం పాఠశాలలో సచివాలయ మహిళా పోలీస్ అక్కివరపు లలితాదేవితో బాలికలు, తల్లులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుగత మల్లిక, పిన్నింటి నాగమణి, నరహరిశెట్టి రమేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లల నోట్సులను పరిశీలించాలి

పద్మనాభం: పిల్లల చదువుపై తల్లిదండ్రులు ఇంటి వద్ద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో - 2 బాబులాల్ సూచించారు. మండలంలోని ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన తల్లిదండ్రుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు పాఠశాలల్లో బోధించిన పాఠ్యాంశాల నోట్సులను ఇంటి వద్ద పిల్లలతో తల్లిదండ్రులు చదివించాలన్నారు. సమావేశంలో హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, ఎంపీటీసీ సభ్యుడు సీర సూరప్పడు, కో ఆప్షన్ మెంబర్ మరగడ అప్పారావు పాల్గొన్నారు.

చేతుల పరిశుభ్రతతో ఆరోగ్యం

తగరపువలస: ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమిలి మండలం మజ్జిపేట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మ్యాజిక్ బస్ సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఏడు పద్ధతుల్లో చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని వివరించారు. చేతులు శుభ్రం చేసుకోకపోతే కలిగే అనర్థాలు, వ్యాపించే వ్యాధులను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి, వల్లభదాసు బాలాజీ, మ్యాజిక్ బస్ ట్రైనింగ్ కమ్ మోనిటరింగ్ అధికారి దూడ రమేష్, దుర్గ, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహించిన గణేష్‌నగర్ వాసులు

మధురవాడ: అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి మధురవాడ గణేష్‌నగర్ వాసులు మానవత్వం చాటుకున్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో కొంత కాలంగా భిక్షాటన చేస్తూ జీవించే ఓ వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానికులు చలుమూరి శ్రీనివాస్, టిక్కులి శ్రీనివాస్, సీహెచ్.వెంకటేశ్వరరావు, రామచంద్రరావు, ప్రభాకర్, వల్లి రమాదేవి తదితరులు కాలనీ వాసుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

టీబీ రోగులకు పౌష్టికాహారం



పౌష్టికాహారం కిట్ అందజేస్తున్న ప్రతినిధులు

మధురవాడ: మధురవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 106 మంది టీబీ రోగులకు పౌష్టికాహారాన్ని మంగళవారం అందజేశారు. అరబిందో కంపెనీ ఆధ్వర్యంలో సుమారు రూ.700 విలువ చేసే 7 రకాల వస్తువులతో కూడిన కిట్లు అందజేసినట్టు పీహెచ్‌సీ ప్రతినిధులు చెప్పారు. టీబీ యూనిట్ సూపర్‌వైజర్ వీరబ్రహ్మం, సురేష్, గోపి, అనూష పాల్గొన్నారు.

996 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

తగరపువలస: స్థానిక రాములమ్మ థియేటర్ ఎదురుగా ఓ ఇంటిలో నిల్వ చేసిన 996 కిలోల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడి ఓ ఇంటిపై దాడి చేసి ఒక వ్యక్తితోపాటు బియ్యాన్ని, సెల్‌ఫోన్‌ను భీమిలి పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఈ దాడులు చేశారు. రేషన్ బియ్యాన్ని ఇంటిలో నిల్వ చేసిన వ్యక్తిని రాంబాబు అనే కిరాణా వ్యాపారిగా గుర్తించినట్టు తెలిసింది. బియ్యం రవాణాకు వినియోగిస్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

జీవీఎంసీ జోన్ - 2 ఏసీ రమేష్‌కు చార్జిమెమో



సాక్షి ఎఫెక్ట్..

మధురవాడ: జీవీఎంసీ జోన్ – 2 రెవెన్యూ విభాగంలో రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసి సెలవులో ఉంటూ సుమారు 20 రోజులపాటు ఫైల్స్ అప్రూవల్ చేసిన పి.రమేష్‌కు చార్జిమెమో ఇస్తున్నట్టు జీవీఎంసీ ఏడీసీ సన్యాసిరావు చెప్పారు. ఇక్కడ గత నెల 20 నుంచి రమేష్ సెలవులో ఉంటూ అధికారికంగా డిజిటల్ లాగిన్ ఉపయోగించి మొత్తంగా 300 వరకు ఫైల్స్ ఆమోదించినట్లు అధికారులు నిర్ధారణకు వచ్చారు. ఆ ఫైల్స్ జోనల్ కమిషనర్, డీసీఆర్‌ల స్థాయిలో అప్రూవల్ అయినట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై ‘రెవెన్యూ విభాగంలో వింత పరిస్థితి’ అనే శీర్షికతో సాక్షి పత్రికలో మంగళవారం వార్త ప్రచురితమయింది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించారు. ఏడీసీ సన్యాసిరావు మాట్లాడుతూ మరింత లోతుగా విచారణ చేస్తామని, ఆర్‌వోతోటు జోనల్ కమిషనర్ పాత్రపై కూడా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

20 రోజుల్లో 300 ఫైల్స్‌కు ఆమోదం

అసిస్టెంట్ కమిషనర్ రమేష్ సెలవులో ఉంటూ 20 రోజుల్లో సుమారు 300 ఫైల్స్ ఆమోదించినట్లు సమాచారం. ముఖ్యంగా గత నెల 28న మధురవాడలోని ఓ అపార్ట్‌మెంట్‌కి చెందిన 186 ప్లాట్‌ల వివరాలు సచివాలయం ద్వారా కాకుండా వేరే మార్గంలో ఒక్క రోజులో అప్లోడ్ చేయగా... ఈ నెల 1నే ఆర్‌ఐ, ఆర్‌వో, జెడ్పీ స్థాయిలో ఆమోదం లభించేసింది. సెలవులో ఉన్న వ్యక్తి పంపిన ఫైల్స్‌ను జెడ్పీ అంత స్పీడ్‌గా ఎలా ఆమోదించారనేది పెద్ద ప్రశ్నగా మిగిలింది.

ప్రజలకు చేరువలో తపాలా జీవిత బీమా



తగరపువలస మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న భీమిలి డివిజన్ తపాలా సిబ్బంది

తగరపువలస: ప్రజలకు చేరువగా తపాలా జీవిత బీమా పథకాలున్నాయని ఆ శాఖ విశాఖ డివిజన్ డిప్యూటీ సూపరింటెండెంట్ జి.హరిబాబు తెలిపారు. మంగళవారం సాయంత్రం చిట్టివలస సబ్ పోస్టాఫీసులో భీమిలి డివిజన్ తపాలాశాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుంచి సేవింగ్, రికరింగ్ డిపాజిట్ల సేకరణ కంటే తపాలా బీమా పాలసీల సేకరణ ఎక్కువగా జరగాలన్నారు. వాటి ఉపయోగాలు ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం కొత్తగా పాలసీలు, ఖాతాలు తీసుకున్న వారిని అభినందించారు. చివరగా సిబ్బందితో తగరపువలస వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. చిట్టివలస సబ్ పోస్టుమాస్టర్ బోని చంద్రశేఖర్, నార్త్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రభుదాసు, పీఎల్‌ఐ డీవో రాజాపోతన్, ఎంవో పి.అప్పలరమణ, గ్రామీణ ప్రాంతాల తపాలా సిబ్బంది పాల్గొన్నారు.

‘ఈ - పంట’లో వివరాల నమోదుతో మేలు

రైతులతో జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్



పాండ్రంగిలో రైతులతో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్



వరి పొలాలను పరిశీలిస్తున్న జేసీ విశ్వనాథన్

పద్మనాభం: రైతులందరూ ‘ఈ - పంట’లో వివరాలు నమోదు చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.విశ్వనాథన్ సూచించారు. మండలంలోని పాండ్రంగి గ్రామాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ – పంట వివరాల నమోదుపై రైతులను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముందుగా రైతులంతా వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు. తదుపరి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. వివరాలు నమోదు చేయించుకున్న రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. అనంతరం ఈ – పంటలో వివరాలు నమోదు చేసిన సర్వే నంబర్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి, ఆర్డీవో భాస్కరరెడ్డి, తహసీల్దార్ వేణుగోపాల్, భీమునిపట్నం సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ ప్రసాద్, మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంపీఎస్‌చలం, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంటల వివరాలు పక్కాగా నమోదు

ఆనందపురం : రైతులకు బహుళ ప్రయోజనాలు కలిగించే పంట నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని జేసీ విశ్వనాథన్ సిబ్బందికి సూచించారు. మండలంలోని గొట్టిపల్లిలో వరి పంట పొలాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పంట నష్టపరిహారం పొందాలన్నా, రైతు భరోసా పొందాలన్నా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నా, ప్రభుత్వ రాయితీలు పొందాలన్నా పంట నమోదుతోనే ముడిపడి ఉంటుందన్నారు. అందువల్ల అధికారులు ప్రతి కమతాన్ని ప్రత్యక్షంగా క్షేత్ర స్థాయిలో చూసి పంట వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో భాస్కరరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి, భీమిలి ఏడీఏ బి.విజయ్ ప్రసాద్, తహసీల్దార్ రామారావు, మండల వ్యవసాయాధికారి సీహెచ్ సంధ్యారత్నప్రభ, వీఏఏలు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ





అలంకరణలో కొత్తమ్మతల్లి, మజ్జివలస రాస పోలమాంబ

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ సంతపేట, కొత్తపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో వివిధ రకాల 5 వేల చాక్లెట్లతో అలంకరించారు. ఈ ప్రత్యేక దర్శనం కోసం భక్తులు ఆలయానికి పోటెత్తారు. అలంకరణకు చిట్టివలసకు చెందిన వాసుపల్లి కుమ్మి, బోని రమణ సహకరించగా భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు అలంకరించారు.

- భీమిలి మండలం మజ్జివలస కూడలిలోని రాస పోలమాంబ అమ్మవారిని గులాబీలు, మల్లెలు, జాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటకు చెందిన చిల్ల రమణ, వెంకటలక్ష్మి దంపతులు ఆలయం వద్ద ప్రసాదాలు పంపిణీ చేశారు.

బోరు బావి నిర్మాణానికి భూమి పూజ



వైఎస్సార్ కాలనీలో బోరు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డులోని కొండ వాలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు అన్ని రకాల చర్యలు చేపడుతున్నారని మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు చెప్పారు. మంగళవారం వార్డులోని వైఎస్సార్ కాలనీలో టైప్-2 కాలనీ 24వ బ్లాకు దగ్గర హ్యాండ్ బోరు నిర్మాణానికి పూజలు చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ ప్రాంతంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పర్యటించినప్పుడు తాగునీటి సమస్య గుర్తించి నిధులు మంజూరు చేశారని చెప్పారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు బండారు శివలక్ష్మి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వంకర అప్పారావు, దేవా, అప్పలరాజు, హేమంత్, రుషికేశ్వరరావు, ప్రసాద్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.